ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది.

మాల బద్ధకంగా గదిలోకి వచ్చి, కుర్చీలో కూలబడింది. గదిలో చిన్న దీపం వెలుగుతోంది. ఆ వెలుగులోనే నిద్రపోతున్న కూతుర్ని చూసి, దీర్ఘంగా నిట్టూర్పు విడిచింది.

ఇహ తాను వెళ్ళి స్నానం చెయ్యాలి. ఎదురుగా టేబిల్ మీద వున్న ఒక చపాతి, పచ్చి కూరగాయ ముక్కలూ, గ్లాసుడు మజ్జిగా — తన కోసం ఎదురు చూస్తున్నాయి.




గోడగడియారం 'ఠంగ్' మని చప్పుడు చేసింది. మాల తలెత్తి చూసింది. ఆ చిన్నవెలుగులో టైమెంతయిందో ఆమెకు సరిగ్గా కనిపించలేదు. లేచి, పెద్ద దీపం వెలిగించడానికి ఓపిక లేదు. మళ్ళీ ఉదయమే లేవడం, షూటింగ్ కార్యక్రమాలూ — మామూలే!

మాల జుట్టంతా సవరించుకుని, వెనక్కిలాగి, ముడి పెట్టుకుంది. నిదానంగా లేచి బట్టలు మార్చి, నైటీ వేసుకుంది. ఒళ్ళంతా అలిసిపోయి వుంది. ఏమాత్రం ఓపికా, శక్తీ లేవు. వెళ్ళి స్నానం చెయ్యడానికీ, ఈ చపాతీ తినడానికీ కూడా చిరాగ్గానే వుంది. పెద్ద లైటు వెలిగించి, బాత్ రూమ్‌కి వెళ్ళి ముఖం కడుక్కుని వచ్చి టైమ్ చూసింది. పదకొండున్నర! అమాయకంగా నిద్రపోతున్న కూతురు పక్కనే కూచుని, ఆ ముఖాన్ని ప్రేమగా నిమిరింది. ఎ.సి. గదిలో ఇంకాస్సేపటికి చలివేస్తుందని, దుప్పటి మెడదాకా కప్పింది. తనూ ఆ మంచం మీదే వాలిపోయింది!

అలిసిపోయిన ఆమె కళ్ళు మూతపడడం లేదు. పొద్దుట్నుంచి ఎండలో, ఆ తర్వాత చీకటి 'ఎఫెక్ట్'లో వీధుల్లో విరామం లేకుండా పని చెయ్యడంతో, శరీరం అంతా లాగుతోంది. ఏ అవయవమూ స్వాధీనంలో లేదు. ఏదో ఆలోచనలూ, ఊహలూ మెదడు నిండా అలుముకున్నాయి ......

మాల ఇవాళ ప్రసిద్ధిచెందిన సినిమా దర్శకురాలు. అంతకుముందు నటీమణి. నాటక రంగం మీద అనేక పాత్రలు ధరించి, చిత్రాల్లో ప్రవేశించి నాయికా పాత్రలు వేసింది. 'ఉత్తమ నటి'గా పలుసార్లు ఎన్నికైంది. ఏ పాత్ర ధరించినా ఆ పాత్రకో విశిష్టత కల్పించి, కలకాలం గుర్తుండేలా నటిస్తుందని ఆమెను అందరూ ప్రశంసిస్తారు. వయస్సు ముప్పై దాటిన తర్వాత మాల, 'కారెక్టర్ రోల్స్' ధరిస్తూ మరింతగా ప్రసిద్ధి చెందింది. ఆ దశలోనే మాలకి అమ్మాయి పుట్టింది. 'వివాహం'గా జరుపుకోలేదు గాని, మాల సుధాకరరావు భార్యాభర్తలుగా కలిసి వుండేవారు. సుధాకరరావూ నటుడే. ఇద్దరూ జంటగా కొన్ని చిత్రాల్లో నటించడంతో చేరువయ్యారు. ఆ చేరిక ఇద్దరి మధ్యా బంధాల్ని కల్పించింది. ఒక దశలో సుధాకరరావుకి పాత్రలు తగ్గిపోయాయి. కాస్త వయసు కనిపించడంతో అటు హీరోగా రాణించలేకపోయాడు; తండ్రి పాత్రల్లాంటివి ధరించడానికి మొహమాట పడ్డాడు. ఆ స్థితిలో మాల మంచి పాత్రలు ధరించింది. పేరూ, డబ్బూ మరింతగా సంపాయించింది. తన సంపాదన తగ్గిపోవడంతో, మాలకి ఎక్కువ గుర్తింపు రావడంతో సుధాకరరావు అక్కడ వుండలేకపోయాడు. ఆమె సంపాదన మీద ఆధారపడి బతకడం ఇష్టంలేకనో, ఆమెకు పేరొస్తోందన్న అసూయచేతనో, మొత్తానికి అతను మాలకి దూరమైపోయాడు. "నే నెక్కడికో పోయి బతుకుతాను. నా గురించి ఆలోచించకు" అని వెళ్ళిపోయాడు. వేరే ఎవర్నో వివాహం చేసుకుని, ఒరిస్సా రాష్ట్రంలో ఎక్కడో వున్నాడని మాల చూచాయగా విన్నది — అంతే! ఐతే, మాల మాత్రం సుధాకరరావుని మరిచి పోలేదు. అతని పేరు మీదనే కూతురికి సుధ అని పేరు పెట్టింది. సుధ అచ్చం తన పోలిక. తన చిన్నప్పటి ఫోటోలు, ఇప్పటి సుధ ఫోటోలూ తేడా లేకుండా కనిపిస్తాయి.

సుధకి ఇప్పుడు పదమూడో సంవత్సరం. కాన్వెంట్‌లో చదువుతోంది. పాటలు, నాట్యం అంటే ఇష్టం. సుధ గురించి, ఆమె బాగోగుల గురించి పట్టించుకోడానికి మాలకి కుదరడం లేదు. ఇంట్లో వుంటున్న విధవరాలు తన అక్క, విశ్వాసంగా తొలి నుంచి పని చేస్తున్న మంగమ్మ - సుధని చూసుకుంటున్నారు. తను కూతుర్ని సరిగ్గా చూడలేకపోతున్నందుకు, కనీసం పలకరించి మాట్లాడలేకపోతున్నందుకూ మాల నిత్యం బాధపడుతూనే వుంటుంది ...

కారెక్టర్ నటిగా ప్రసిద్ధి పొందుతున్న రోజుల్లోనే మాల, వీలైనన్ని విదేశీయ చిత్రాలు, మంచి స్థాయిలో వుండే దేశీయ చిత్రాలూ చూస్తూ, కథలు, పాత్రలూ చర్చిస్తూ వుండేది. పత్రికల వాళ్ళకి ఇచ్చే ఇంటర్వ్యూలు, ఆమె మనో భావాలూ, నిర్దిష్టమైన అభిప్రాయాలు చూసి ఒక నిర్మాత ఆమెను ఒక చిత్రం డైరక్టు చెయ్యమని కోరాడు. మాల మనసులో ఎక్కడో మినుకు మినుకు మంటున్న ఆ దీపానికి అతను నూనె పోశాడు! ఆమె డైరెక్టు చేసిన ఆ చిత్రం ఆర్థికంగాను, స్థాయిలోను విజయవంతం కావడంతో దర్శకురాలిగా ఆమెకు ఒకటీ, ఒకటీ చిత్రాలు రాసాగాయి. దర్శకత్వంలో నిమగ్నమైపోయిన తర్వాత, మాల నటించడం మానేసింది. దర్శకురాలిగా మంచి పేరు తెచ్చుకోడానికి ఎక్కువ చిత్రాల్లో నటించడం అడ్డొస్తుందని ఆమె అభిప్రాయపడింది ......

గోడ గడియారం రెండు గంటలు కొట్టింది. మాలకి నిద్ర రావడంలేదు. తెల్లవారుతూనే లేచి, మళ్ళీ షూటింగ్‌కి బయల్దేరాలి. పైగా మర్నాడు చాలా కార్యక్రమాలున్నాయి. కొత్త చిత్రానికి పాటల కంపోజింగ్ జరుగుతోంది. లంచ్ టైమ్‌లో వెళ్ళి అవి వినాలి. అక్కడి నుంచి వచ్చిన వెంటనే, ప్రారంభం కాబోతున్న ఇంకో చిత్రానికి అల్లిన సన్నివేశాలు వినిపించడానికి

రచయిత వస్తానన్నాడు. అవి వినాలి పూర్తయిన ఇంకో చిత్రం ఫైనల్ ఎడిటింగ్‌లో వుంది. ఆరు గంటల నుంచి అక్కడ కూచోవాలి ... ఒక్కోసారి, ఇన్ని ఎందుకు పెట్టుకున్నానా అని తాను మథన పడుతూనే వుంటుంది. కాని, తప్పడంలేదు!

వీటన్నింటికీ తోడు మాల మనసులో మెదుల్తున్న మరో విషయం వుంది. అది — సుధని నటిని చెయ్యడం. మాలకి నటన మీద భక్తి, పూజ్యభావం. చిన్నతనం నుంచి తనకి పేరు, తర్వాత ప్రఖ్యాతి, ఆస్తి పాస్తులూ సమకూర్చిపెట్టి, తాను ఇవాళ ఇలా నిలబడ గలగడానికి కారణం - ఆ నటనే! ఆ నటన తనతో అంతరించిపోకూడదు. తను ఎంతగానో రుణపడి వున్న నటనను తన కుటుంబం విస్మరించకూడదు. అందుకనే కృతజ్ఞతా సూచకంగా సుధను నటిని చెయ్యాలని తాపత్రయ పడుతోంది. ఇప్పుడు సుధ నేర్చుకుంటున్న సంగీతం, నాట్యం అందులోని భాగాలే. సుధకి కూడా ఆ కళల మీద ఎంతో అభిమానం. చదువుతోపాటు, వాటి మీద కూడా ఆమె ఉత్సాహం చూపుతూనే వున్నది.

సుధకి పదిహేడు, పద్దెనిమిది సంవత్సరాలు వచ్చే వరకూ తను ఈ రంగంలో వుండాలని, తర్వాత సుధని నటిగా తీర్చిదిద్దుతూ తాను విశ్రాంతి తీసుకోవాలనీ మాల అభిప్రాయం. ఐతే, తాను దగ్గరుండి సుధను చూసుకోవాలి. తగిన వరుణ్ణి చూసి పెళ్ళి చెయ్యాలి. పెళ్ళయిన తర్వాత కూడా ఆ భర్త ఆమెను నటించడానికి అభ్యంతర పెట్టకూడదు. సుధ జీవితం తన జీవితం లాగా, ఆకాశ మార్గంలో ఎగురుతున్న 'తాడు తెగిన' గాలిపటం కాకూడదు! సుధాకరరావును తను పూర్తిగా నమ్మింది. జీవితాంతం తనకి తోడుగా వుంటూ, కష్టసుఖాల్లో పాలుపంచుకుంటాడని విశ్వసించింది. ఐతే, సుధాకరరావు చేసింది, తన దృష్టిలో మోసమే, అతని దృష్టిలో న్యాయం అనిపించవచ్చునేమోగాని!

ఏమైనా.



తను వేసిన తప్పటడుగు లాంటిది సుధ జీవితంలో పడకూడదు. సినిమా రంగంతో ఏ మాత్రం సంబంధం లేని పెద్ద ఆఫీసరుకో, సంస్కారం గల విద్యావంతుడికో తన కూతుర్నిచ్చి ఘనంగా పెళ్ళి చెయ్యాలి! వివాహ వైభవంతో తను పొందలేకపోయినవన్నీ సుధ పొందాలి. ఆ ఘట్టాల్నీ, జీవితాన్ని తాను కళ్ళారా చూసి, మనసారా ఆనందించాలి.

మాల ఇంకా సుధ గురించే ఆలోచిస్తోంది. సుధ తన కూతురు అని కాదు కాని, ఒక దర్శకురాలిగా పరిశీలిస్తే సుధలో ఆ 'కళ' ఎంతగానో కనిపిస్తుంది. స్పష్టమైన మాట, భావానికి తగ్గట్టుగా సహజంగా కదిలే నల్లని పెద్దకళ్ళు, చిలిపితనం, చురుకుదనం ఇవన్నీ సుధలో కనిపించి, ఆమె మంచి నటికాగలదన్న విశ్వాసాన్ని కల్పిస్తాయి. ఐతే, మంచి డైరెక్టర్ చేతిలో పడాలి? మంచి పాత్రలు లభించాలి! ...

మాల కళ్ళు బరువెక్కుతున్నాయి. ఏ మూల నుంచో చిన్న ఆవులింత లేచి, నిశ్శబ్దంగా జోలపాడింది. సుధ వైపు తిరిగి, తన చేతిని ఆప్యాయంగా ఆమె మీద వేసి, బరువుగా కళ్ళు మూసింది మాల.

** ** **

షూటింగ్ చాలా హడావిడిగా వుంది. ఆ చిత్రానికి సంబంధించిన చివరి దృశ్యం షూటింగ్ ఆరోజు. చాలామంది నటీనటులున్నారు. అందరూ రావడానికి



స్త్రీకి హృదయముంది
...... అది నవనీతం
స్త్రీకి ప్రాణముంది
...... ఆమె బొమ్మకాదు
రాయి అసలే కాదు
ఆమె గౌతమి
కరుణాంతరంగ
గంగ
స్త్రీ!

-నిఖిలేశ్వర్

టైమ్ పడుతుంది. ఎంత రాత్రయినా సరే, ఆ దృశ్యాన్ని ఇవాళ పూర్తి చెయ్యాలని దర్శకురాలు మాల, ఆ చిత్రం నిర్మాతా గట్టిగా అనుకున్నారు. సిద్ధమైన నటీ నటులు ఒక్కొక్కరే సెట్లోకి వస్తున్నారు. మాల ఒక మూల కూచుని, శ్రద్ధగా స్క్రిప్టు చూసుకుంటూ, సంభాషణలు అక్కడక్కడ తగ్గిస్తూ, షాట్స్ తిరగరాసు కుంటోంది.

"మేడమ్" అని పిలిచాడు సహాయ దర్శకుడు. మాల తలెత్తి చూసింది.

"హీరోయిన్, తండ్రీ ఇద్దరూ సిద్ధంగా వున్నారు. వాళ్ళ షాట్స్,గుమ్మం దగ్గర తీస్తానన్నారు..."

"ఆ :.. కెమెరామాన్‌తో చెప్పి అక్కడ లైటింగ్ చెయ్యమనండి. వస్తున్నాను" అని మాల మళ్ళీ స్క్రిప్టులో నిమగ్నమయింది.

మరుక్షణంలో సెట్లో సందడి చెలరేగింది. లైట్లు కెమెరా, ట్రాలీ అన్నీ రాసాగాయి.

"వాళ్ళిద్దరూ ఆ గుమ్మంలోంచి ఎంటరవుతారు. వచ్చి ఇక్కడ నించుంటారు" అని సహాయ దర్శకుడు చెప్పాడు. దానికి తగ్గట్టుగా ఛాయాగ్రహకుడు లైటింగ్ ఏర్పాటు చేస్తున్నాడు.

"ఆ లైట్ తీసేయ్ ... ఇటురా ... ఇది కొంచెం సాఫ్ట్ చెయ్యి ... సైలెన్స్ ... ఇక్కడో బేబీ పెట్టు ..." అని సూచనలు చేస్తున్నాడు ఛాయాగ్రహకుడు. హీరోయిన్ పాత్ర ధారిణీ, ఆమె తండ్రి పాత్రధారీ సంభాషణలు చెప్పుకుంటున్నారు.

కలం ముడిచి బాగ్‌లో పెట్టుకుంటూ, మాల లేచి వచ్చింది. "రెడీ మేడమ్" అన్నాడు సహాయ దర్శకుడు.

"మేడమ్."




Adworld/1105/87


''ఏమిటి?''

''ప్రొడ్యూసర్ కోటిలింగంగారట - మీతో మాట్లాడాలని ఎప్పట్నుంచో వెయిట్ చేస్తున్నారు'' అని చెప్పాడు ప్రొడక్షన్ మేనేజర్.

''ఇప్పుడెలా కుదుర్తుంది? అసలే గందరగోళంలో వున్నాం. షూటింగ్ అయిపోతే, సాయంకాలం కలుద్దాం అని చెప్పండి'' అంది మాల — ''రెడీ. ఆర్టిస్టుల్ని రమ్మనండి'' అని అటు వెళ్తూ.

''... ఆయన ... ఊరు వెళ్ళాలిట. లంచ్ బ్రేక్ వరకూ వుంటార్ట. ఐదే నిమిషాలు మీతో మాట్లాడి వెళ్తానంటున్నారు'' అన్నాడు తిరిగొచ్చిన మేనేజరు.

''సరే'' అంది మాల తన పనిలో నిమగ్నమైపోతూ. నటీనటులు వస్తున్నారు ... ఇంకో చోటుకి వెళ్ళవలసిన వాళ్ళు వెళ్ళాలని గోల చేస్తున్నారు. వాళ్ళని తీసుకెళ్ళ డానికి వచ్చిన ఆ కంపెనీల మేనేజర్లు కంగారు పడుతున్నారు ... షాట్స్ జరుగుతూనే వున్నాయి. విరామం, విసుగూ లేకుండా, కంగారు, చిరాకూ పడిపోకుండా మాల షాట్స్ తీస్తూనే వుంది — ఒంటిగంట — విరామం వచ్చే వరకూ.




లంచ్ బ్రేక్‌లో మళ్ళీ అంతా గందరగోళం. కొందరు వెళ్తున్నారు ... కొందరు భోజనాలు ఎక్కడంటున్నారు ... కొందరు ఇళ్ళకి వెళ్ళొస్తాం కార్లు కావాలంటున్నారు ... ఏం చెయ్యాలో తోచక నిర్మాత కంగారు, హడావుడీ పడిపోతున్నాడు. మాల, ఆ పక్కనే వున్న చిన్న గదిలోకి వెళ్ళి కూచుంది.

''నిర్మాత కోటిలింగంగారు ...'' అన్నాడు మేనేజర్.

''రమ్మనండి'' అంది మాల, రిలాక్స్ అవుతూ.

కోటిలింగం మాలతో చాలాసేపు మాట్లాడాడు. తనని ఆలోచించుకోనిమ్మని ఎంతగా చెప్తున్నా అతను వినిపించుకోడం లేదు. ' ఊ ' అనమంటాడు. తాను వూరు వెళ్తున్నాడు గనక, ఈ విషయం తేలిపోతే, తిరిగి వస్తూనే తాను ఏర్పాట్లు చేసుకోవాలంటాడు. కోటిలింగంతో మాలకి పరిచయం లేకపోయినా, అతనొక దక్షత గల నిర్మాతగా ఆమె ఎరుగును. మంచి సినిమాలు తీసి, వ్యాపార రీత్యా లాభాలు కూడా తెచ్చుకున్నాడు. మాలకి భోజనం వడ్డించడానికి. కుర్రాడు అక్కడ ఎంతసేపుగానో నిలబడి వున్నాడు. తను రెండు ముద్దలు తినేసి, మధ్యాన్నం షూటింగ్‌లో పడాలి.

''అలాగే లెండి'' అంది మాల చివరికి. కోటిలింగం సంతోషంగా వెళ్ళిపోయాడు.

కోటిలింగం భారీ ఎత్తున ఒక శృంగార చిత్రం తియ్యాలని ఆశ పడుతున్నాడు. విశేషంగా అమ్ముడు పోయిన ఒక నవలను కొన్నాడు. ఆ నవల మాల కూడా చదివింది. సినిమాకి బాగానే వుంటుంది. అందులో తను ఒక ముఖ్య పాత్ర ధరించాలి. మరో కోరిక ఏమిటంటే, ఆ పాత్రకి ఒక కూతురుంటుంది. ఆ పాత్రని మాల కూతురు సుధ ధరించాలి! చిత్రాన్ని ఆమె డైరెక్టు చేస్తానంటే అంతకంటే కావలసిందేం లేదు! తను వెయ్యనంటే ఇంకెవర్నయినా పెట్టుకుంటాడు. డైరెక్షన్ విషయం తర్వాత ఆలోచించవచ్చుననీ, తనూ, సూధా నటిస్తాం అనీ ''అలాగే'' అంది మాల.

ఆ రాత్రి మాల ఆలోచనలో పడింది. చాలాకాలం తర్వాత తను మళ్ళీ నటించబోతున్నది. ఆ పాత్ర కూతురు, అచ్చం తల్లిలాగే వుంటుందన్న కారణంగా, కోటిలింగం తననీ, సుధనీ కోరుకోవడం సబబుగానే కనిపించిందామెకు. ఐతే సుధకి అనుభవం లేదు. తాను వున్న ఘట్టాల్లో అయితే తను ధైర్యం చెబుతూ జాగ్రత్తగా నటింపజేస్తుంది. తను లేని ఘట్టాల్లో ఆ డైరెక్టరు అంత శ్రద్ధా తీసుకుని నటింపచెయ్యాలి. ఈ చిత్రమే సుధకి పునాది. ఇందులో మంచి పేరు రావాలి; నటిగా ఆమె నిలదొక్కుకోవాలి...

ఆలోచించి ఆలోచించి మాల ఒక నిర్ణయానికి వచ్చింది- తానే చిత్రాన్ని డైరెక్టు చేస్తుంది. అందులో తన స్వార్థం వున్నా, సినిమా బాగా రూపొందడానికి-ఆ స్వార్థం చాలా మట్టుకు దోహదం చేస్తుంది. తన పాత్రని తను మలుచుకుంటూ, సుధ పాత్రని జాగ్రత్తగా తీర్చి దిద్దేతూ బాగా నటింపజేయొచ్చు. మర్నాడు ఆ మాట సుధతో చెప్పింది మాల.

''నువ్వు పక్కనే వుంటావుగా మమ్మీ. ఎంతో ధైర్యంగా వుంటుంది. నీ డైరెక్షన్ అయితే నాకేం భయం?'' అంది సుధ. తను దర్శకత్వం కూడా చేస్తానన్నమాట నిర్మాత కోటిలింగానికి కబురు చేసింది మాల.

*          *          *

కొత్త సినిమా షూటింగ్ ఆరంభమైంది. తన పాత్రను తను చూసుకుంటూ, చిత్రాన్ని బాగా డైరెక్టు చెయ్యాలని మాల శ్రద్ధ తీసుకుంటోంది. నటిస్తున్నంతకాలం తను డైరెక్టు చెయ్యలేదు. తను డైరెక్ట్ చేసిన చిత్రాల్లో నటించలేదు. అందువల్ల ఈ సినిమా తనకొక 'ఛాలెంజ్'గా నిలబడింది. డైరక్షన్‌లో పడి తన పాత్రను విస్మరించరాదు; పాత్ర పోషణలో పడి, తక్కిన చిత్రాన్ని దర్శకురాలిగా ఏ మాత్రం నిర్లక్ష్యం చెయ్యరాదు! ఈ రెండింటికంటె ముఖ్యమైనది సుధని చక్కగా తీర్చిదిద్ది ఆ పాత్రకీ, సుధకీ పేరు తీసుకురావడం!

సుధ పాత్ర కాలేజీలో చదువుకుంటున్న ఒక అమ్మాయి పాత్ర. వచ్చీరాని వయసు. తెలిసీ తెలియని జ్ఞానం. ఆ పాత్ర స్వభావాన్ని సుధకి బాగా నచ్చజెప్పి, కొన్ని కాలేజీ దృశ్యాలు తీసింది మాల. సుధ నటన తృప్తిగానే వుందని తనూ అనుకుంది; తక్కినవాళ్ళూ అన్నారు.

ఆ పాత్రని ఒక కాలేజి కుర్రాడు ప్రేమిస్తాడు. ఆ పాత్రకి కూడా ఆ అబ్బాయి మీద అభిమానమే. అయితే, తెలిసీ తెలియని జ్ఞానంలో వున్న ఆ పిల్లని మాయమాటలు చెప్పి ఆ అబ్బాయి నమ్మించి, ఒక రోజుఎక్కడికో తీసుకెళ్తాడు. మగాడి స్పర్శ ఎరగని ఆ అమ్మాయికి ప్రేమ పాఠాలు చెప్పి, దగ్గరకు తీసుకుని అనుభవిస్తాడు! అదీ దృశ్యం!

మాల ఆ దృశ్యాన్ని చిత్రీకరించడానికి సర్వసన్నాహాలూ పూర్తి చేసింది. అది చిత్రంలో కీలకమైన దృశ్యం గనుక, మాగా వివరంగా తియ్యాలని మాల అభిప్రాయపడింది. ఆ సన్నివేశాన్ని, అందులో వుండే ఆ మృదుత్వాన్నీ సుధకి బోధించింది. నిజానికి సుధ వయసు కూడా అంతగా అర్థం చేసుకునే వయసు కాదు.

''నాకు నువ్వు ప్రతిదీ విడమరిచి చెప్పు మమ్మీ, నేను అలాగే చేసేస్తాను'' అంది సుధ. మాల సంతోషించింది. ఆ దృశ్యం షూట్ చెయ్యడానికి లైటింగ్ ఏర్పాటు చేస్తున్నారు. రిహార్సల్సు ఆరంభమయినై. ఆ అబ్బాయి సుధని దగ్గరగా తీసుకుని ముఖంలో ముఖం పెట్టి నెమ్మదిగా సంభాషణ చెప్పాలి. ఆమె సిగ్గు పడుతుంది. భయపడుతుంది. అతనింకా దగ్గరగా తీసుకుంటాడు. ఆ అమ్మాయి అతని కళ్ళలోకి చూస్తూ అతని మాటలు వింటూ వుండిపోతుంది. మాల షాట్‌ని ఇద్దరికీ వివరించి, రిహార్సలు చేయించింది.

''ఇంకాస్త దగ్గరగా వెళ్ళమ్మా. ఫర్వాలేదు. సిగ్గు

# దర్శక పితామహుడు



## పి.పుల్లయ్య అస్తమయం

దర్శక పితామహుడు, ప్రముఖ నిర్మాత అయిన పి.పుల్లయ్య మే 29వ తేదీ తెల్లవారు ఝామున గం. 3- 30కి మద్రాసులోని గోపాలపురంలోగల ఆయన స్వగృహంలో స్వర్గస్థులయ్యారు. ఆయన వయసు 76 సంవత్సరాలు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, మనవడు, మనవరాళ్ళు వున్నారు. గత మూడు సంవత్సరాలుగా ఆయన డయాబిటిస్ వ్యాధితో బాధపడుతున్నారు.

నెల్లూరుకు చెందిన పి.పుల్లయ్య 1930 ప్రాంతాలలో మద్రాసు వచ్చి తొలుత హెచ్.ఎం.వి. గ్రామఫోన్ కంపెనీ మూల సంస్థ అయిన 'హబిసన్స్'కి ప్రతినిధిగా వృత్తి జీవితాన్ని ప్రారంభించారు.

1935లో స్టార్ కంబైన్స్ సంస్థ అద్దంకి శ్రీరామమూర్తి, కన్నాంబలతో నిర్మించిన 'హరిశ్చంద్ర' చిత్రానికి రాజోపధ్యాయతో కలిసి పి.పుల్లయ్య తొలిసారి దర్శకత్వం వహించారు.

'తిరుగుబాటు', 'అర్ధాంగి' వంటి చిత్రాలకు దర్శకత్వం వహించారు. 1937లో 'సారంగధర' చిత్రంలో నటించిన శాంతకుమారితో పరిచయం ఏర్పడి, ఆ పరిచయం ప్రణయంగా మారి, చివరికి అది వారి వివాహానికి దారి తీసింది.

పి.పుల్లయ్య 1960లో పద్మశ్రీ పిక్చర్స్ సంస్థను స్థాపించి ఎన్నో వైవిధ్యమైన చిత్రాలను స్వీయదర్శకత్వంలో రూపొందించారు. ఆయన రూపొందించిన తొలి చిత్రం 'జగన్నాటకం.'

ఆయన విశిష్ట సేవను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం 1982లో రఘుపతి వెంకయ్య నాయుడు అవార్డు ఇచ్చి సత్కరించింది.

—మిక్కిలినేని జగదీష్‌బాబు

పడకూడదు... ఆ అబ్బాయికి దగ్గరగా వెళ్ళి, ఆనుకుని కూచో..." అంది మాల. సుధ ఇబ్బందిపడుతూ వుంటే తను చెప్పిన సూచన మళ్ళీ ఒక్కసారి మనసులో మెరిసింది మాలకి...

'...దగ్గరగా వెళ్ళి...ఆనుకుని కూచో...అనిసుధతో తను చెప్పిందా... అశుభం శుభం ఎరగని తన సుధకి తాను ఈ విధంగా 'ప్రేమపాఠం' నేర్పిందా... ఈ వయసులోనే దాని వంటిమీద పరాయివాడి చేత చేతులు వేయిస్తోందా?...'

ఒక్క క్షణం మాల శరీరం జలదరించింది!... కళ్ళు తిరిగినట్టయింది. ఐతే, అంతలోనే నిభాయించుకుంది. 'తను దర్శకురాలు... సుధ నటి. అంతే! ఇక్కడ ఇంకే సంబధం లేదు! తల్లి కూతుళ్ల అనుబంధం ఇంటి దగ్గర, సెట్టు బయట!...

'తనకెందుకు వున్నట్టుంది ఇప్పుడీ భావం వచ్చిందీ? తొలిసారిగా తన కూతుర్ని ఇలాంటి ఘట్టంలో డైరెక్టు చేస్తూ వుంటే, ఎవరికైనా ఇలాంటి భావన కలుగుతుందేమో!'

'సరే! తను ఇక్కడ తల్లి కాదు- సుధ కూతురూ కాదు'. "చెయ్యమ్మా... చూడు బాబూ... నువ్వు అమ్మాయి ముఖాన్ని అలా చేతులతో పట్టుకుని దగ్గరకు లాక్కో" అంది మాల. ఆ అబ్బాయి అలాగే చేస్తున్నాడు. 'సుధ దగ్గరగా వెళ్తోంది. అవును, తన సుధే- నటి సుధ కాదు....' మళ్ళీ మాల మనసులో ఆందోళన... ఆలోచన...

నెమ్మదిగా కుర్చీలో కూచుని, వేడిగా టీ తెప్పించుకుని తాగింది మాల. తనలో పొంగి వస్తున్న భావాలను ఎంతగా తాను అణుచుకోవాలనుకుంటున్నా, తక్కిన వాళ్లు చూస్తున్నారేమోనన్న భయం కూడా వేసింది మాలకు.

"మేడమ్! రెడీ! షాట్ తీద్దామా..." అని అడిగాడు



కెమెరామాన్.

"ఆ... ఎస్... రెడీ..." అంది మాల "స్టార్ట్' చెబుతూ. షాట్ సరిగ్గా కుదరలేదు. సుధ జంకింది. అబ్బాయీ దర్శకురాలి కూతురు అని కాబోలు భయ పడుతున్నాడు.

ఎటో చూస్తూ మాల "ఓ...కె.." అంది నీరసంగా.

"లేదు మేడమ్. చాలా కృత్రిమంగా వుంది. ఇంకో టేక్ తీసుకుందాం." అన్నాడు కెమెరామెన్ సహాయ దర్శకుడికేసి చూసి. అతనూ ఆ మాటే అన్నాడు.

"అ... లా... గే" అంది మాల. మరో టేక్... మరో టేక్.. అలా ఆరు, ఏడుసార్లు తీశారు.

తర్వాతి షాట్స్‌లో ఇద్దరూ ఇంకా దగ్గరకు రావాలి. ఆ అబ్బాయి సుధని గుండెలకు హత్తుకుంటాడు. ఆమె అతని ఒళ్లో ఇమిడిపోవాలి. ఇద్దరూ నెమ్మదిగా అలా.. అలా... మంచం మీద ఒరిగిపోవాలి. వాళ్ళ కళ్లు కలుసుకుంటాయి. చేతులు బిగుసుకుంటాయి... కాళ్ళు దగ్గరవుతాయి... పెదవులు దగ్గరవుతాయి.

తను రాసుకున్న షాట్లన్నీ చూసుకుంది మాల. అంతా వివరంగా ఇరవై షాట్స్‌లో తియ్యాలి. ఈ పరిస్థితిలో తను తియ్యగలదా.... తన కూతురితో చెప్పగలదా... తన కూతురు అలా ఒరిగిపోతూ వుంటే తను చూడగలదా... ఏమో... ప్రయత్నించాలి...' మాల తర్వాత షాట్స్ వివరిస్తోంది. ఐతే మనసు మనసులో లేదు... కళ్లలో ఏదో అశాంతి... గొంతులో ఏదో గద్గదం...

రెండు క్షణాలు ఆలోచించి, "ఏమిటో- ఒంట్లో బాదోగా వుంది. ఇది మంచి దృశ్యం. బాగా రావాలి. నాచేత ఇప్పుడుకాదు. రేపు తీసుకుందాం. కాన్సిల్ చెయ్యండి" అంది మాల కుర్చీలో కూలబడి.

"పేకప్" అని అరిచారెవరో.

"వాట్సరాంగ్ మేడమ్?" అని అడిగాడు కెమెరా మాన్.

"ఏం లేదు. అలసటగా వుంది. బహుశా ఓవర్ వర్క్ వల్ల కావచ్చు... రెస్ట్ తీసుకుంటే సరిపోతుంది లెండి" అన్నది మాల ఎటో చూస్తూ.

*　　　*　　　*

గోడ గడియారం పదకొండున్నర చూపిస్తోంది. సుధ మంచి నిద్రలో వుంది. అంత నిద్రలోనూ ఆమె పెదవులు కదుల్తున్నట్టున్నాయి. ముఖంలో ఏవో ఆనంద రేఖలు కనిపిస్తున్నట్టున్నాయి... పక్కనే కూచుని ఆలోచిస్తున్న మాల- సుధనే చూస్తోంది...

'తన కూతురు చేత తాను 'ప్రణయ దృశ్యం' చేయించలేకపోతోంది. కారణం?... ఏమిటో... అంతా నటనే గదా... తాను ఇదివరలో ఎన్ని ప్రణయ దృశ్యాల్లో నటించలేదు? అలా సుధ కూడా నటించడమేగా... ఇక్కడ తల్లి-కూతురు అన్న భావం ఎందుకొస్తోంది?...

'అంత మరీ వివరంగా ఆ శృంగార దృశ్యాన్ని చిత్రించకపోతే ఏమవుతుంది? - చిత్రించాలి! చిత్రానికి అది అవసరం! కాని... తను... తను... చేయించలేక పోతోంది... తను నిభాయించుకోవాలి... ఇంత అను భవం వుండి, ఇంతటి నటీమణై వుండి- అది నటన అనుకోకపోవడం ఎంత సిగ్గుచేటు!- నో! రేపు ఈ దృశ్యాన్ని స్పష్టంగా తియ్యాలి. తను దర్శకురాలు... సుధ నటి- అంతే!'

గోడ గడియారం రెండు కొట్టింది. మాల మస్తిష్కం లోని ఆలోచనా తరంగాలు ఆగడం లేదు... 'లాభం లేదు...తను నాణానికి ఒకవైపే ఆలోచిస్తోంది.. రెండో వైపున వున్న మాతృ సంబంధాన్ని, ఆ ఆవేదననీ ఆలోచించుకోలేకపోతోంది. తల్లిగా తాను అలాంటి దృశ్యాన్ని, తన కూతురుతో చిత్రీకరించలేదు... దర్శకత్వం, నటన- ఈ రెండింటినీ నెట్టుకొచ్చి, ముందు నిలబడుతోంది మాతృత్వం! ఇది స్త్రీత్వంలో వున్న బలహీనతా?... ఘనతా?... ఏమో, తను మాత్రం ఈ మాతృత్వ భావాన్ని మరిచిపోయి ఎంత వద్దనుకున్నా- అక్కడ దర్శకురాలిగా 'నటించ'లేదు!...'

గోడగడియారం అరగంట కొట్టింది. మాలమనసులో మరికొన్ని భయాలు లేచాయి. 'తను సుధని పెద్ద నటిని చెయ్యాలనుకుంది- నిజమే; ఆమెను ఒక గొప్పవాడి చేతిలో పెట్టాలనుకుంది. నిజమే!... కాని... అది సాధ్యమవుతుందా?... భర్త వదిలేసిన ఒక సినిమా నటి కుమార్తెనీ, సినిమానటినీ చేసుకోడానికి తను వూహించి నంతటి సంస్కారవంతుడు లభిస్తాడా?... ఆ దృశ్యంలో సుధ, ఆ అబ్బాయి చేరువ అవుతున్నప్పుడు... తన మనసులో రేగిన ఆందోళనలో ఇంకో 'ఘట్టం' కూడా వుంది... తానూ, సుధాకరరావు అలా... 'క్లోజ్'గా నటిస్తూనే, చనువుగా వుంటూనే, ఒకరి మీద ఒకరు అనురాగం ఏర్పరచుకున్నారు. అలాగే సుధ కూడా ఆ అబ్బాయితోగాని, ఇంకే 'హీరో'తో నైనాగాని... నో!... వద్దు!... కుదరదు... తనలాగే సుధ కూడా ప్రేమలో పడకూడదు... తను 'నటన' కోసం తపించిపోతోంది. సుధని నటిని చెయ్యాలని అభిలషిస్తోంది... కాని, అది ఇంకో విధంగా పరిణమిస్తే?.... సుధకు మంచి సంబంధం చెయ్యాలన్న ఆశ అణగారిపోతుంది... సుధ పది కాలాల పాటు భర్తతో కలిసి చల్లగా వుండాలి... అలా వుండాలంటే తన తర్వాత కూడా 'కళారాధన' తన కుటుంబంలో జరగాలన్న ఆశ అంతరించిపోతుంది. ఐతేనేం- ఫర్వాలేదు... తను జీవించి వున్నంతవరకూ తను ఆ కళను ఆరాధిస్తుంది... అదే కృతజ్ఞత!...

ఇంకో గంట సేపు కూడా ఆలోచించి, మాల- నిర్మాతకు ఉత్తరం రాసింది:

శ్రీ కోటిలింగం గారికి!

ఈ చిత్రంలో మా సుధ నటించదు. కారణాలు అడగవద్దు. తల్లీ కూతుళ్ల పాత్రలు ఒక పోలికలో వుండాలనుకుంటే, నా పాత్రకి కూడా ఎవర్నో చూడండి! దర్శకత్వం నుంచి కూడా నన్ను తొలగించగలిగితే నేనింకా సంతోషిస్తాను. దేనికీ కారణాలు మాత్రం అడగొద్దని కోరుకుంటున్నాను. మావల్ల కలిగిన ఇబ్బందులకు మన్నించవలసిందిగా కోరుతూ, జరిగిన నష్టానికి పరిహారంగా లక్ష రూపాయిలు పంపిస్తున్నాను.

\- మాల

## ఎండాకాలంలో ఓ రోజు

పొద్దున్నే మంచంమీద నుంచి
నిద్ర లేవీ లేవకుండానే
వైతాళిక గీతం పాడుతుంది
తొలి సూర్య కిరణం
ఆపై ఆఫీసుకు వెళ్తున్నామా
విశ్వాస పాత్రుడైన సేవకునిలా
వెన్నంటే వస్తుంది వదలకుండా
మధ్యాహ్నం బస్సెక్కుతామా
మనకంటే ముందే వచ్చి
మన పక్క సీట్లోనే కూర్చుంటుంది
ఆప్త బాంధవునిలా
ఇక సాయంత్రం ఇంటి ముఖం
పట్టినపుడు కూడ
వీడ్కోలు గీతం వినిపిస్తుంది
మలి కిరణం

మందరపు హైమవతి

సిరి మింగిన వెలగపండు
యండమూరి వీరేంద్రనాథ్
ప్రత్యేక నవల త్వరలో ప్రారంభం